# శవానందలహరి

టాక్సీ కారు దిగి టకటకా లోపలికొచ్చింది సుశీల.

"నన్ను నీ గుండెమీదాడించావు బాబాయ్." గుండెలు బాదుకుంది. బతికున్నన్ని రోజులు బ్రహ్మాండంగా డబ్బు సంపాదించి ఎంగిలిచేత కాకిని కొట్టేందుకిష్టపడని సీతాపతి కిదేమీ వినబడదుగదా ! శవం చుట్టూ మూగిన జనాలు సుశీలను వింతగా చూస్తున్నారు.

"నా ఇంటికొచ్చి ఇలవేల్పు వైతావనకున్నా బాబాయ్..." అయాచితంగా ఆయాసం ముంచుకొచ్చింది. పైట చెంగుతో కళ్లద్దుకుంది. ముక్కు సర్దుకుంది.

"మళ్లీ పెళ్లి చేసుకోవయ్యా మహానుభావా అంటే చచ్చిపోయిన నా భార్యకన్యాయం చేయలేనని హఠం జేస్తివి. ఇప్పుడెట్లా... " సీతాపతి వడ్డీ వ్యాపారంలో కమీషన్ ఏజెంటుగా పంజేస్తున్న మహిళామణి కొప్పు సవరించుకుంది.

"మా సీతాపతి బాబాయి కెవ్వరూ లేరనుకుంటున్నారా !" జనసంద్రం ఈదుతూ గుంపులోంచి గోవిందం తోసుకొచ్చాడు.

సుశీల దంగైపోయింది. "నేనున్నాగదా ! ఈయనా, మా నాన్న స్వయాన అన్నదమ్ములు. మా బాబాయికి నేనంటే ప్రాణం. ఇక్కడికొచ్చి ఆస్తిపాస్తుల వ్యవహారాలు చూసుకొమ్మని మొన్ననే ఫోన్ చేసిండు. ఇదిగో... అందుకే ఈరోజు నా భర్తను వెంటేసుకొచ్చా ..." గొంతు గద్గదమైంది. "ఇంతలోనే ఘోరం జరిగిపోయింది.."

గోవిందం గుండెల్లో స్టెన్‌గన్ పేలింది. "అదేం గాదు. ఈయన నా బాబాయే. ఒరేయ్ ! గోవిందా ! నేను కాశీయాత్రకెల్తున్నాను. నేనొచ్చేదాకా ఇక్కడి వ్యవహారాలన్నీ చూసుకోవాలిరా... అని పదిరోజుల క్రితమే ఫోన్ చేసిండు. నీ కంటే ముందుగా వచ్చి ఊదుబత్తీ అంటించాను చూడు... బంగారం లాంటి బాబాయి శవమైపోయాడనే దుః ఖాన్ని భరించలేక అటు కూచున్నా..."

బుర్రలో జోరీగ జొచ్చినంత పనైంది సుశీలకు.

"నా బాబాయిని పట్టుకుని నీ బాబాయంటావా ? ఒళ్లు జాగర్త..." నడుముకు కొంగు బిగించింది. నాయకీ నాగమ్మలా పిడికిలి బిగించింది.

"అయ్యో అయ్యో... చూశావా బాబాయ్... నీ గోవిందాని కేంగతి పట్టిందో" శవాన్ని తాకబోయాడు. భార్య సైగ అందుకున్న సుశీలభర్త అతన్ని లాగి పారేశాడు.

"గోవిందా, గోవిందా ! నువ్వెవరూ ?" నిగ్గదీసింది.

"అయ్యో ... నన్నే గట్లంటున్నవా ! మా అమ్మ, ఈయన భార్య ఒకే రక్తం పంచుకుపుట్టినోళ్లు.... కాశీలో ఆవిడకు తలకొరివి పెట్టింది నేనే తెల్సా !" గొంతులో

గందరగోళం. గుసుగుసలు బయలుదేరినై. ఐదారేళ్లక్రితం కాశీయాత్రకు జంటగా వెళ్లిన సీతాపతి ఒంటరిగా తిరిగొచ్చిన సంగతి అందరికీ తెలుసు. ఆయన భార్య కాశీవిశ్వనాథుని సన్నిధిలో, పుణ్యగంగానదిలో కొట్టుకుపోయిందని విన్నారుగూడా. ఎన్ని జన్మల పుణ్యమో... పునిస్త్రీగా పుణ్యలోకాలకు చేరిందని మహిళాలోకం కోకిలై కూసింది.

అదేమిటోగాని... కోట్లకి పడగెత్తిన సీతాపతి కొందరితోనైనా కలిసుండడం నామోషీగా భావించేవాడు. ఏ జన్మలో ఏ జంటను విడదీశానో, ఈ జన్మలో వైపత్నీక మనుభవిస్తున్నానని కుమిలిపోయేవాడు. అద్దాల్లాంటి పాలిష్ బండల మీద మెత్తని పరుపు. మెత్తని పరుపుమీద మల్లెపూవులాంటి తెల్లని గుడ్డ. తెల్లగుడ్డ మీద నల్లబారిన సీతాపతి శవం. మెడలో బంగారు గొలుసు మిలమిల. నాలుగు చేతివేళ్లకు నాణ్యమైన బంగారు ఉంగరాలు. రెండుంగరాలప్పటికే సుశీల కైవసమై పోయినై. సుశీల చాకచక్యాన్ని కళ్లారా చూసిన గోవిందం గుండె చెదిరి చెరువైపోయింది. వెంటనే రంగప్రవేశం చేసి మొదటి శోకరాగం ముగిసేలోగా ఓ ఉంగరం ఊడబీక్కున్నాడు. రెండో రాగం ఎత్తుకునే లోగా రెండోది నొక్కేశాడు.

"నీ గురించి మా బాబాయి మాటమాత్రమైనా చెప్పలేదు. నువ్వెళ్లిపో తల్లీ ... కావాలంటే ఆడపచు లాంఛనాలేవన్నా ..." సుశీల చెయ్యి పట్టుకు బతిమాలుతున్నాడు. సుశీల సింహావతారమెత్తింది. "అమ్మో ... పట్టపగలు నా చెయ్యి పట్టుకుంటావేమిరా పాగల్." చెంపమీద ఒక్కటిచ్చింది. మిగతా రెండుంగరాలు తనక్కాకుండా చేసినందుకు తలబాదుకుంది గూడా. "దారిన పోయే దానయ్యవు ... మా బాబాయెప్పుడూ నీ గురించి చెప్పలేదురా."

"పరాయి సొమ్ము కాశపడ్తే పంచమహాపాతకాలు చుట్టుకుంటై. ఆస్తికోసం నయవంచనకు దిగొద్దు సుశీలా...." చెంప పుణుక్కుంటూ దేవేరించాడు.

"నయవంచన నాదా, నీదా ?" పిచ్చిగా అరిచింది.

లడాయి సాగుతూనే ఉంది.

"పీనుగు మీద పురుగులు పాకుతున్నై నీయవ్వ ... ముందు గాసంగతి చూడుండ్రి..." కోపంతో అన్నారెవరో. వింటేగా !... వచ్చే జనాలు వస్తున్నారు. పోయేవాళ్లు పోతున్నారు. కడుపులో ఎలుకలు పరుగెడుతున్నై. "మళ్లీ వస్తా" నని గోవిందం బయటి కొచ్చి హోటల్ దారి పట్టాడు.

"మనమలా వెళ్లి సుగంధద్రవ్యాలు తెద్దాం పదండి" భర్తను లాక్కెళ్లింది సుశీల. సుగంధ్ర ద్రవ్యాల కంటె ముందు హోటల్ సౌందర్య కనబడింది.

"నాన్నా ... అయ్యో నాన్నా ... ఎంత ఘోరం జరిగింది నాన్నా..." సీతాపతి

శవం చుట్టూ తిరుగుతూ కుళ్లి కుళ్లి ఏడుస్తున్నాడు ఆనందం.

సుష్ఠుగా భోంచేసొచ్చిన సుశీల, గోవిందాలకు మతిపోయినంత పనైంది. ఇద్దరి దృష్టి ఒకేసారి శవం మెడమీద వాలింది. ఒంటిపేట బంగారు గొలుసు ఆనందం జేబులో కెళ్లిపోయిందని అర్థమైపోయింది.

"నువ్వెవడివోయ్ ..." ఆనందం గల్లాబట్టి లాగాడు గోవిందం.

"మా బాబాయి బంగారు గొలుసునెందుకు మాయం జేసినవ్?" నిలదీసింది సుశీల.

"మాయం జేసే ఖర్మ నాకెందుకు ? మామూలుగానే తీసుకున్నా. నా పేరు ఆనందం. సీతాపతి గారి రక్తం పంచుకు పుట్టినవాణ్ని...' కుడితిలో ఎలుకలై పోయారిద్దరూ.

"మా బాబాయి కసలు సంతానం లేదు."

"అయ్యో ! మీరెవరు ? మీగురించి ఎపుడూ చెప్పలేదే నాన్న ? అబద్ధాలు చెప్పకండి." వెర్రిగా అరిచాడు. "నీ బొంద నువ్వే అబద్ధం..." సుశీల చెప్పు సవరించు కుంది. "సీతాపతి గారు వరంగల్‌లో చదివేప్పుడు మా అమ్మను ప్రేమించాడట... తాత మంకుపట్టుకు తలవొగ్గి మా నాన్న మేనమరదలు మెడలో ముళ్లేశాడట. నెలకు రెండు మూడుసార్లన్నా వరంగలొచ్చి వెళ్లేవాడు. మా అమ్మ ప్రాణాలీయన చేతుల్లోనే పోయినై. అంత్యక్రియలు దగ్గరుండి ఘనంగా జరిపించాడు. తనకెవరూ లేరు గాబట్టి మంచి రోజు చూసి నన్ను తీసుకువస్తాన్నాడిక్కడికి." శవమ్మీద వాలబోయాడు. సుశీల భర్త, గోవిందం తమ చేతుల్ని అంపశయ్యగా అల్లేసి అడ్డుకున్నారు.

"నువ్వు గొట్టంగానివి..." గోవిందం ఆగలేక పోయాడు. "అప్టరాల్ ఆస్తికోసం అమ్మను బజార్లో పెడ్తావా ! నడు బయటికి..." కాండ్రించి ఉమ్మేశాడు. సుశీల అడ్డుకుని "నువ్వొ దయచెయ్. నా బాబాయి శవాన్ని, నన్ను వదిలేసి మీరెళ్లిపోండిహ..." బయటికి చూపించింది.

"వామ్మో... వాయ్యో... మా నాన్నను నా కొదిలేసి మీరెళ్లిపోండి..." జనానికి చేతులెత్తి నమస్కరించాడు ఆనందం.

"నమస్కారంలోనే ఉంది మస్కా ...." గుంపులోంచి ఎవరో అన్నారు.

"ఆస్తికోసం ఆ తర్వాత తన్నుకుందురు గానీ ముందు అంత్యక్రియల సంగతి చూడండి" వీధి పెద్దమనిషి మందలింపు.

"శవమున్నపుడే ఐసా పైసా తేలిపోవాలి..." సుశీల పాటపాడింది.

"మీరు ముగ్గురూ తప్పుకోండి. సీతాపతి శవం సంగతి, ఆస్తుల సంగతి మేమే తేల్చుకుంటాం" ఇంటివెనుక ఇందిర బాంబు పేల్చింది.

"నో... అదెట్లా !" ఇపుడు ముగ్గురిదొకేమాట.

నవ్వాలో ఏడ్వాలో అర్థంగాక జనాలు మొహాలు చూసుకున్నారు. పొద్దు గడుస్తూనే వుంది. కర్మసాక్షి అలిసిపోయి కనుమరుగయాడు. ఎవరో స్విచ్ నొక్కారు. ట్యూబులైటు కాంతి ఇల్లంతా పరుచుకుంది.

"ఇప్పటికైనా శవాన్ని లేపండి. మా చేతనైన సాయం చేస్తాం" వీధి పెద్దమనిషి సలహా ఇచ్చాడు. ఎవరూ స్పందించలేదు. ఇహ లాభం లేదు అనుకొని వీధి జనాలు ఇళ్లల్లోకెళ్లి తలుపులు బిడాయించుకున్నారు. పొద్దుట్నుంచి నిరాఘాటంగా పోరాడుతున్న వారసులను అలసట, నీరసం ఆవహించాయి. కడుపులో కలకలం బయలుదేరింది. అక్కడినుంచి వెళ్లి కోడి పలావు తిని కమ్మని సీసాలు ఖాళీ చేసి మత్తుగా లాడ్జింగ్‌లో పడుకున్నారు. కలలు గన్నారు. రోజట్లాగే భళ్లున తెల్లవారింది. కాఫీ, టిఫిన్లు ముగించి సరికొత్త వ్యూహాలతో వచ్చేశారు వారసులు. మూడంతస్తుల బంగళా తలుపులు బార్లా తెరుచుకున్నాయి. గోడగడియారం పదిసార్లు టంగుమంది. లోపల ఎవ్వరూ లేరు. శవం గూడా లేదు. శవాన్ని మాయం చేసింది నువ్వంటే నువ్వని సిగపట్లకు దిగారు.

"ఆగండి" తెల్లపాంటు, నల్లకోటు పెద్దమనిషి లోపలికొచ్చి ముగ్గుర్ని విడదీశాడు. కుర్చీ తెచ్చుకుని కాలుమీద కాలేసుక్కూచున్నాడు.

"అ..యి...తే మీరు సీతాపతి వారసులా ?" గొంతు గాంభీర్యం.

"కాకపోతే మీరా ?" ఛాలెంజి విసిరాడు గోవిందం.

ముందు జాగ్రత్త చర్యగా సుశీల బుగ్గలు సిగ్గులమయమైపోయినై.

"వీళ్ళిద్దరూ కాదండి. సీతాపతి బాబాయి వారసురాల్ని నేనే..." ఒయ్యారం ఒలకబోసింది. ఆనందం గుండెజారి అరచేతిలోకొచ్చింది. "వాళ్లు దొంగవారసులు. నేనాయన రక్తం పంచుకుపుట్టిన వాన్ని ..." అఫెన్స్ కంటే డిఫెన్స్ మేలనిపించింది. ఆనందం మొహంలో ఆనందరేఖలు తచ్చాడినై. "మీరు మా నాన్నగారి లాయరనుకుంటాను దయచేసి ఆస్తిపాస్తులు నాకప్పగించి వీళ్లను తరిమేయండి మీరడినంత ఫీజు, మల్లెపూవుల్లో పెట్టిస్తా..."

పెద్దమనిషి నవ్వుతూ కోటు సవరించుకుంటూ లేచి నుంచున్నాడు. "మాది ఈ పక్కిల్లే. నేను లాయర్ని గాదు. మీరు వారసులూ కారు. వీధి వాళ్ళమంతా పొద్దున్నే మున్సిపల్ కమీషనర్ని సంప్రదించాము. ఓగంట క్రితమే మునిసిపల్ సిబ్బంది వచ్చి సీతాపతి శవాన్ని ఈడ్చుకెళ్లారు. మీరు దయచేయండి."

*(ఆదివారం ఆంధ్రప్రభ, 24-6-2001)*